సాక్షి
జనగామ

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తే కేసులు

ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సివిల్ సప్లయీస్ టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ ఎం.ప్రభాకర్ అన్నారు. రైస్ మిల్లుల్లో తనిఖీ చేశారు. - 8లో▸



తస్మాత్ జాగ్రత్త..

ఇటీవల ట్రయల్ రూమ్, హాస్టల్ గదుల్లో స్పై కెమెరాలు అమర్చిన ఘటనలు వింటున్నాం. అలాంటి ప్రదేశాల్లో మహిళలు అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు. - 8లో▸



వాతావరణం

ఉదయం నుంచి పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉంది.

సీఎంఆర్ గోల్‌మాల్

దేవరుప్పుల మిల్లు వ్యవహారంతో వెలుగు చూసిన అక్రమాలు

- కస్టం మిల్లింగ్‌పై సర్కారు ఫోకస్
- మిగిలిన గడువు ఐదు రోజులే..
- ఇంకా పెండింగ్‌లో 42,292 మెట్రిక్ టన్నుల బియ్యం



జనగామ: కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్)లో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. సీఎంఆర్ కింద ప్రభుత్వం కేటాయించిన ధాన్యం నిల్వల్లో తేడా కనిపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం.. పర్యవేక్షణ లోపం కారణంగా కొంతమంది మిల్లర్ల మాయాజాలంతో రూ.కోట్ల విలువైన బియ్యం పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు రెండు రోజుల క్రితం దేవరుప్పుల రారైస్ మిల్లులో బయట పడిన అక్రమాలే నిదర్శనం.

పర్యవేక్షణ లోపం..

మిల్లర్లకు సీఎంఆర్ కింద ధాన్యం కేటాయించే సమయంలో బియ్యం అప్పగింతకు సంబంధించిన నిబంధనలు వివరించాలి. రోజువారీగా బియ్యం తయారీ.. ధాన్యం నిల్వలు ఎంతమేర ఉన్నాయనే దానిపై నిర్వహిస్తున్న రికార్డుల్లో ధాన్యం నిల్వలు ఉన్నట్టు చూపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో కనిపించడంలేదని సమాచారం. ఇటీవల జిల్లాలో సంబంధిత శాఖల అధికారులు బాయిల్డ్, రారైస్ మిల్లుల్లో నిల్వ ఉన్న సీఎంఆర్ ధాన్యం, అప్పగింతకు సిద్ధంగా ఉన్న బియ్యం నిల్వలను లెక్కించారు. ఇందులో దేవరుప్పుల మండలం మన్‌పహాడ్‌లోని పి.చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన సాయిరామ్ మోడ్రన్ బిన్నీ రైస్ మిల్లులో రూ.5.67కోట్ల విలువైన ధాన్యం నిల్వలు లేనట్టు గుర్తించారు. సదరు రైస్ మిల్లుకు 1,987.560 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, 1,774.071 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయం చేసినట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ యాజమాన్యంపై క్రిమినల్ కేసుకు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ రికవరీ యాక్టు ప్రకారం యజమాని ఆస్తులను జప్తు చేయాలని కోరారు. ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం మాయమైనా.. అంతా ఓకే ఉందని గతంలో పని చేసిన పౌరసరఫరాల శాఖ, సివిల్ సప్లయీస్, మార్కెటింగ్ శాఖలకు చెందిన ఇద్దరు ఉన్నతాధికారులు క్లీన్ చీట్ ఎందుకు ఇచ్చారనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.

మరో ఐదురోజులే గడువు..

2023–24 వానాకాలం, యాసంగి సీజన్‌లో సీఎంఆర్ కింద జిల్లాలోని బాయిల్డ్, రారైస్ మిల్లులకు 2,23,670 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, 1,51,000 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 98,474 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు అప్పగించారు. ఇంకా 52,792 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. యాసంగి సీజన్‌లో 19 రారైస్ మిల్లులకు 9,035.600 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించగా, 6,053 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. కానీ మిల్లర్ల నుంచి ఇప్పటి వరకు ఒక్క క్వింటా బియ్యం కూడా రాకపోవడం గమనార్హం. ఈ బియ్యం అప్పగించడానికి ఈనెల 30వ తేదీ వరకు మాత్రమే గడువు ఉంది. కేంద్ర ప్రభుత్వం గడువు పెంచుతుందా లేదా అనేది వేచి చూడాలి.

సీజన్ వారీగా సీఎంఆర్ వివరాలు:

2023–24 వానాకాలం(ఖరీఫ్): 18 బాయిల్డ్ రైస్ మిల్లులకు సీఎంఆర్ 27,354.280 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 18,327.368 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 16,979.512 మెట్రిక్ టన్నుల బియ్యం వచ్చింది. ఇంకా 1,422.192 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. అలాగే 40 రారైస్ మిల్లర్లకు 53,509.960 మెట్రిక్ టన్నుల ధాన్యం సరఫరా చేయగా 35,851.673 మెట్రిక్ టన్నుల బియ్యానికి 27,469.970 మెట్రిక్ టన్నులు డెలివరీ చేశారు. ఇంకా 8,381.704 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది.

2023–24 యాసంగి(రబీ) : 20 బాయిల్డ్ రైస్ మిల్లర్లకు సీఎంఆర్ కింద 1,33770.560 మెట్రిక్ టన్నుల ధాన్యం పంపగా 90,963.981 మెట్రిక్ టన్నుల బియ్యానికి 54,025 మెట్రిక్ టన్నులు వచ్చాయి. ఇంకా 36,934.588 మెట్రిక్ టన్నులు బాకీ ఉంది. 19 రారైస్ మిల్లర్లకు 9,035 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా 6,053 మెట్రిక్ టన్నుల బియ్యానికి ఇప్పటి వరకు ఒక్క క్వింటా కూడా రాలేదు.

వందశాతం లక్ష్యంగా..



జిల్లాలో 2023–24 సంవత్సరానికి సంబంధించి వానాకాలం, యాసంగి సీజన్‌లో బాయిల్డ్, రారైస్ మిల్లుకు సీఎంఆర్ కింద అప్పగించిన ధాన్యంలో వంద శాతం బియ్యం సేకరణే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ఈ ఏడాది యాసంగిలో రారైస్ మిల్లర్లకు ఇచ్చిన ధాన్యంలో ఇప్పటి వరకు బియ్యం రాలేదు. ఈ విషయమై మిల్లర్లు తక్షణం స్పందించాలని ఆదేశాలు జారీ చేశాం.

- హథీరామ్, సివిల్ సప్లయీస్ డీఎం

మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో డిపార్ట్‌మెంట్, ప్రైవేట్ ఎస్పీఎం షెడ్‌ల నిర్వాహకులు, అందులో పని చేసే సిబ్బందికి తోషిబా కంపెనీ వారిచే ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుపై స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. వైండింగ్‌లో సమస్యలున్నాయా? ఆయిల్ ఫిల్టర్‌లో డస్ట్, కోర్‌లో చిప్పింగ్, మాయిశ్చర్ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి బాగుచేయాలని చెప్పారు. ప్రతీ జిల్లాలో డిపార్ట్‌మెంట్, ప్రైవేట్ ఎస్పీఎం షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే.. ప్రతీ జిల్లాకు మోడల్ ఎస్పీఎం షెడ్‌ను నెలకొల్పుతామని పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ షెడ్లు అన్నింటినీ ఆధునికీకరిస్తామన్నారు. మెరుగైన, నాణ్యమైన రిపేర్లు పెరగడానికి ప్రైవేట్ ఎస్పీఎం షెడ్ల నిర్వాహకులను వివిధ కంపెనీల్లో చేస్తున్న మరమ్మతుల అధ్యయనానికి పంపించనున్నట్లు వివరించారు. నిర్వాహకులు, సిబ్బందికి ఉండే సందేహాలు నివృత్తి చేసేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. శిక్షణ కార్యక్రమాలు ఈ నెల 29 వరకు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు టి.సదర్‌లాల్, టి.మధుసూదన్, సీజీఎం కేఎస్ గుట్ట, జీఎం అన్నపూర్ణ, హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటి సరఫరా లక్ష్యం



శిక్షణను పరిశీలిస్తున్న సీఈ లలిత తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మిషన్‌భగీరథ చీఫ్ ఇంజనీర్ లలిత అన్నారు. గ్రామాల్లోని తాగునీటి సరఫరా సహాయకుల కు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మా ట్లాడారు. వాటర్‌మెన్‌లకు జిల్లా వ్యాప్తంగా నాలుగురోజుల శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా ప్లంబింగ్, పైపులైన్, చేతిపంపులు, ఎలక్ట్రికల్ మోటార్లు, గేట్‌వాల్వ్‌ల మరమ్మతు, పైపులైన్ల లీకేజీలు, వాటర్ ట్యాంకుల టెస్టింగ్, క్లీనింగ్ అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఈ కృష్ణయ్య, గ్రిడ్ ఈఈ రాజయ్య, ఇంట్రా ఈఈ శ్రీకాంత్, డీఈ కరణ్‌కుమార్, ఏఈ ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రొబేషనరీ ఎస్సైలకు స్టేషన్‌ల కేటాయింపు

వరంగల్ క్రైం: శిక్షణ పూర్తి చేసుకుని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు వచ్చిన ప్రొబేషనరీ ఎస్సైలకు స్టేషన్‌లు కేటాయిస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి పోలీస్‌స్టేషన్ ఈనెల 25 నుంచి వచ్చే నెల 9 వరకు, రెండో పోలీస్‌స్టేషన్ వచ్చే నెల 10 నుంచి 24వ తేదీ వరకు పనిచేసే విధంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెండవ బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ప్రొబేషనరీ ఎస్సైలకు పోలీస్‌స్టేషన్‌లు కేటాయించారు. పల్లె ప్రవీణ్ – కాజీపేట, మామునూర్, బొల్లాబోయిన హేమలత – సుబేదారి, వర్ధన్నపేట, బండారి శివ-మిల్స్‌కాలనీ, రఘునాథపల్లి, బొమ్మినేని సుజాత – ఆత్మకూర్, హనుమకొండ, అనంతగిరి మధు – జనగామ, ఇంతేజార్‌గంజ్, లింగాల దిలీప్ – నర్సంపేట, హసన్‌పర్తి, పల్లి భాగ్యశ్రీ – ఘన్‌పూర్, పరకాల పోలీస్‌స్టేషన్‌లను కేటాయించారు.

న్యూస్‌రీల్

కళాక్షేత్రానికి చుక్క సత్తయ్య పేరు పెట్టాలి



జనగామ/లింగాలఘణపురం: హనుమకొండలో నిర్మించిన కళాక్షేత్రానికి లింగాలఘణపురం మండలం మాణిక్యాపురం గ్రామానికి చెందిన కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ చుక్క సత్తయ్య కళాక్షేత్రంగా నామకరణం చేయాలని బహుజన కులాల ఐక్యవేదిక ప్రతినిధుల బృందం కోరింది. ఈ మేరకు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు బుధవారం వినతి పత్రం అందజేసింది. కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ఆలేరు ఎమ్మెల్యే, విప్ బీర్ల ఐలయ్య సంఘీభావ పత్రాలను కూడా జత చేసినట్లు ఉస్తాద్ ఒగ్గు రవి తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఒగ్గు బీర్ల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒగ్గు ధర్మయ్య, రాష్ట్ర కార్యదర్శి గొరిగె మల్లేశం, రేవు కిష్టప్ప, కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్, కంచె రాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

సొసైటీ వైస్‌చైర్మన్ అనర్హతపై హైకోర్టు స్టే..

రఘునాథపల్లి: కంచనపల్లి వ్యవసాయ సహకార సంఘం వైస్‌చైర్మన్ మూడ్ ధర్మ అనర్హతపై హైకోర్టు స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన కాపీని బుధవారం ధర్మ డీసీఓ రాజేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ నేపథ్యంలో ధర్మ వైస్‌చైర్మన్‌గా కొనసాగనున్నారు. సొసైటీ పరిధి కుసుంబాయితండా ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్‌గా కొనసాగిన వైస్‌చైర్మన్ ధర్మ కొనుగోలులో అవకతవకలకు పాల్పడి రైతులకు నష్టం చేశాడనే కారణంతో అతడిని జిల్లా కోఆపరేటివ్ అధికారి అనర్హుడిగా ప్రకటించారు. దీనిని సవాల్ చేస్తూ ధర్మ హైకోర్టును ఆశ్రయించగా.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సొసైటీ డబ్బు వాడుకున్న విషయంలో చైర్మన్ చీమలపాటి రవీందర్ జీపై అనర్హత వేటు పడిన నేపథ్యంలో వైస్ చైర్మన్‌గా ఉన్న తనను చైర్మన్‌గా నియమించాలని ధర్మ కోరుతున్నారు.

ఆక్రమించుకున్న ‘డబుల్’ ఇళ్లు ఖాళీ చేయాలి




పాలకుర్తి టౌన్: ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఆక్రమించుకుని నివాసం ఉంటున్న వారు వెంటనే ఖాళీ చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాలకుర్తిలో 50, దర్దేపల్లిలో 40, తొర్రూరు(జె) వడ్డెరకాలనీలో 30 ఇళ్లకు లబ్ధిదారులను గుర్తించి ఆన్‌లైన్ చేశామన్నారు. అర్హులకు ఇళ్లు ఇస్తామని చెప్పారు. తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ పాల్గొన్నారు.

రేపు ‘వేస్ట్ టు వెల్త్’ ఎగ్జిబిషన్

జనగామ రూరల్: ‘వేస్ట్ టు వెల్త్’ 2024–25 జిల్లా స్థాయి ఎగ్జిబిషన్ ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు డీఈఓ రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌జీసీ ఎకో క్లబ్ కలిగిన పాఠశాలలు 60 ఉన్నాయని, స్కూల్‌కు ఇద్దరు విద్యార్థులు, ఒక టీచర్ చొప్పున పాల్గొనాలన్నారు. ఏదైనా ఉపయోగించని మెటీరియల్(వేస్ట్ టు వెల్త్) ద్వారా ఉపయోగకరమైన, ఆకర్షణీయమైన కళ లేదా క్రాఫ్ట్ తయారు చేసి ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఉత్తమ ప్రదర్శనలకు మొదటి బహుమతి కింద రూ.3,000, ద్వితీయ రూ.2,000, తృతీయ రూ.1,000 అందజేయనున్నట్లు తెలిపారు. పాల్గొనే వారందరికీ ప్రయాణ భత్యంతో పాటు మధ్యాహ్న భోజన సదుపాయం ఉంటుందని, టీఏ క్లైం చేసుకోవడానికి ఉపాధ్యాయులు స్కూల్ స్టాంప్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

29 నుంచి ఇంటర్ కాలేజీయెట్ టోర్నమెంట్స్



హసన్‌పర్తి: ఈనెల 29వ తేదీ నుంచి రెండ్రోజుల పాటు ఇంటర్ కాలేజీయెట్ పురుషుల టోర్నమెంట్స్ నిర్వహించనున్నట్లు కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్‌లో భాగంగా షటిల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

పత్తి, వరి పంటల్లో సస్యరక్షణ చేపట్టాలి

- శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్



పత్తి పంటను పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త అనిల్‌కుమార్

తరిగొప్పుల/నర్మెట: పత్తి పంటలో నల్ల మచ్చ, కాయకుళ్లు తెగులు, పూత, గూడ, కాయ రాలడం, వరిలో కాండం తొలుచు పురుగు వంటి వాటిని గుర్తించాం.. నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, భువనగిరి ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. జనగామ డివిజన్ సహాయ సంచాలకులు ఎస్.ఎస్ బీనాతో కలిసి బుధవారం నర్మెట, తరిగొప్పుల మండలాల్లో వరి, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తెగుళ్లు, క్రిమికీటకాల నివారణకు రైతులకు సూచనలు, సలహాలు చేశారు. పత్తిలో బ్యాక్టీరియా, నల్ల మచ్చ, కాయకుళ్లు తెగుళ్లు, పూత, గూడ, కాయ రాలడాన్ని నివారించడానికి ఎకరానికి 20 గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్, 600 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాలను పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ సంతోషి, ఏఈఓలు కమల, రేష్మా, ప్రవళిక, అభ్యుదయ రైతులు పింగిళి రాంరెడ్డి, రమేష్, రాకేష్, హనుమారెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్ర శర్మ



థియేటర్‌లో ప్రకటనను వీక్షిస్తున్న జడ్జి తదితరులు

జనగామ రూరల్: సమస్యల పరిష్కారానికి కక్షిదారులు రాజీపడాలి.. ఆదే సులువైన మార్గం.. ఈనెల 28వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్ర శర్మ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ విషయం ప్రజలందరికీ తెలిసేలా బుధవారం జిల్లా కేంద్రంలోని దేవీ సినిమా థియేటర్‌లో ప్రదర్శించిన ప్రకటనను ఆయన సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్, డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారథి, సీఐ తదితర అధికారులతో కలిసి వీక్షించారు.

కొమ్మూరిపై ఆరోపణలు చేస్తే ఊరుకోం

- కాంగ్రెస్ పట్టణ పరిధి వార్డుల అధ్యక్షులు



సమావేశ స్థలంలో వార్డుల అధ్యక్షులు

జనగామ: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ పరిధి 30 వార్డుల అధ్యక్షులు హెచ్చరించారు. స్థానిక ఓం సాయి గార్డెన్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ కొమ్మూరికి అండగా ఉంటుందని, జనగామ నియోజకవర్గంలోని కొంతమంది సీనియర్ నాయకులు ప్రతాపరెడ్డిపై లేనిపోని అభాండాలు వేస్తూ పార్టీ స్థాయిని దిగజారుస్తున్నారని అన్నారు. 15 ఏళ్లుగా ఇక్కడ పార్టీ ఓటమికి కారణమవుతూ గ్రూపులకు ఆజ్యం పోస్తున్నారని, ఈ విషయమై అధిష్టానం సీరియస్‌గా ఆలోచించాలని కోరారు. కొమ్మూరికి సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశామని, అందరం కలిసి జిల్లా మంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డిని త్వరలోనే కలిసి సీనియర్లపై ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కడారు ప్రవీణ్ కుమార్, జనార్దన్, వెంకటేష్, సిద్దులు, సంజీవరెడ్డి, యుగేందర్, సతీష్, ఎం.ప్రవీణ్, స్టాలిన్, పర్వతాలు, మల్లేశం, ఆజామ్ షరీఫ్, సోమయ్య, మల్లారెడ్డి, గిరిబాబు, మధు, ఉపేందర్, ప్రసాద్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, ఖరీమొద్దిన్, రవి, ప్రవీణ్, లింగమూర్తి, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, నరేష్, కైలాసం, ముజ్జు, జాన్, శ్రీశైలం, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య



సమావేశంలో పాల్గొన్న ఎంపీ కావ్య, కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్

జనగామ రూరల్ : మహిళా శక్తి పథకంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య అన్నారు. చాకలి ఐలమ్మ జిల్లా మహిళా సమాఖ్య 8వ వార్షిక మహాసభను జిల్లా గ్రామీణాభివద్ధి శాఖ ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ.. ప్రతీ మహిళ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఒక వ్యాపార వేత్త కావాలని, అన్ని రంగాల్లో రాణించి ప్రగతిపథంలో దూసుకు పోవాలన్నారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉత్పత్తులను తయారు చేసి ఆదాయం గడించాలన్నారు. మహిళా సభ్యులందరూ రుణాలు పొందేలా అధికారులు, మహిళా సంఘం సభ్యులు కృషి చేయాలని సూచించారు. రుణాల రికవరీ గతంలో కన్నా పెరిగిందని పేర్కొన్నారు. అనంతరం అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, డీఆర్‌డీఓ వసంత, జెడ్పీ సీఈఓ సరిత తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నేపథ్యంలో ఈనెల 25 నుంచి నిర్వహిస్తున్న వారోత్సవాల వాల్ పోస్టర్లను కలెక్టరేట్‌లో ఎంపీ, కలెక్టర్, అదనపు కలెక్టర్, సంక్షేమాధికారి ఆవిష్కరించారు. వారం రోజులు నిర్వహించే కార్యక్రమాల గురించి వివరించారు. 26న ఆశ్రమాల్లోని వయోవృద్ధులకు కీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకతాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రులు పోషణ, సంక్షేమ చట్టం–2007, ఆరోగ్య సంరక్షణపై అవగాహన, 29న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన, 30న అంగన్‌వాడీ కేంద్రాల్లో పేరెంట్స్ డే, సెప్టెంబర్ ఒకటిన జిల్లా స్థాయి వయోవృద్ధుల దినోత్సవం ఉంటుంది.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

కలెక్టరేట్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యాన గంగోత్రి సంఘం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేశారు. బుధవారం క్యాంటీన్‌ను కలెక్టర్‌తో కలిసి ఎంపీ కావ్య ప్రారంభించారు. అనంతరం అందరూ కలిసి భోజనాలు చేశారు.

అంకితభావంతో సర్వే చేపట్టాలి

- విద్యాశాఖ జిల్లా సెక్టోరియల్ అధికారి నర్సింహారావు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న నర్సింహారావు

దేవరుప్పుల : ప్రత్యేక అవసరార్థులైన వికలాంగుల సంక్షేమం కోసం చేపట్టే సర్వేను అంకితభావంతో నిర్వహించాలని విద్యాశాఖ జిల్లా సెక్టోరియల్ అధికారి నర్సింహారావు అన్నారు. దివ్యాంగులకు చేయూతనివ్వడానికి మండల పరిధి కామారెడ్డిగూడెంలో తలపెట్టిన ప్రశస్త్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. వైకల్యం కలిగిన పిల్లల బావి జీవితాన్ని మెరుగుపరిచేందుకు ప్రశస్త్ సర్వే దోహదపడుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఏకకాలంలో జరిగే ఈ సర్వే అక్టోబర్ 26 లోపు పూర్తి చేయాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సదస్సులో మండల విద్యాధికారి జి.కళావతి, రిసోర్స్ పర్సన్ గోలి తిరుపతిరెడ్డి, స్థానిక హెచ్ఎం రాజేందర్‌కుమార్, ఎంఆర్‌సీ సిబ్బంది గోలి రవీందర్‌రెడ్డి, మార్గం నర్సింహులు, సంధ్య, బుర్ర యాకస్వామి, రామ్‌చందర్, మంజుల, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు

జనగామ: మున్సిపల్ వైస్‌చైర్మన్, టీపీసీసీ కార్యదర్శి కంచె రాములును హత్య చేసేందుకు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుట్ర పన్నినట్లు చెప్పాలని బెదిరింపులకు పాల్పడి రహస్య వీడియో తీశారంటూ కాంగ్రెస్ పార్టీకి నాయకులు రాగుల శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురు కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకులతో మాట్లాడుతూ.. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి.. కంచె రాములును హత్య చేసేందుకు తనకు సుపారీ ఇచ్చినట్లు శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడని, అదే వ్యక్తి మరుసటి రోజు కంచె రాములు, మున్సిపల్, మార్కెట్ మాజీ చైర్మన్లు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్ జనగామ ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి పిలిపించి బెదిరింపులకు పాల్పడుతూ ప్రతాప్‌రెడ్డికి వ్యతిరేఖంగా మాట్లాడించారని మరో పిటిషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కొమ్మూరి తనకు సుపారీ ఇవ్వలేదని, కేవలం వారి నుంచి తప్పించుకునేందుకే మాట్లాడగా.. దానిని రహస్యంగా వీడియో తీసి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు నాయకులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హత్యకు ప్లాన్ చేశాడని ముందుగా పిటిషన్ ఇచ్చిన వ్యక్తే.. బెదిరించడం వల్లే అలా చేశానని మరో ఫిర్యాదు రావడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పంపుసెట్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి

- ఏడీఈ వంశీకృష్ణ



గృహ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఈ వంశీకృష్ణ

జఫర్‌గఢ్: వ్యవసాయ పంపుసెట్లకు రైతులు తప్పనిసరిగా కెపాసిటర్లు బిగించుకోవాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏడీఈ వంశీకృష్ణ సూచించారు. బుధవారం తిమ్మంపేటలో సిబ్బందితో కలసి పర్యటించిన ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ పంపుసెట్లకు బిగించిన ఆటోమేటిక్ స్టార్టర్లను తొలిగిస్తే ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు లోడు పడకుండా నివారించవచ్చన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఈ సందర్భంగా పలు అంశాలపై రైతులు, గృహ వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈ విశ్వసాహితి, సబ్‌ఇంజనీర్ రాంబాబు, లైన్ ఇన్‌స్పెక్టర్ కాలురాం, లైన్‌మన్ కుమారస్వామి, జేఎల్ఎం అనిల్, కట్టర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

- డీఐఈఓ జితేందర్‌రెడ్డి



కళాశాల స్టాఫ్‌తో మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: అధ్యాపకులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా ఇంటర్ మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ జితేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ కళాశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన పరిసరాలు, అధ్యాపకుల అటెండెన్స్ రిజిస్టర్లు, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. నిత్యం స్టడీ అవర్స్ నిర్వహించి విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని చెప్పారు.

పౌరసేవలో ఎస్సై రాజేందర్‌కు అవార్డు



డీజీపీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్సై

చిల్పూరు: ఇటీవల చిల్పూరు పోలీస్‌స్టేషన్ నుంచి కేయూసీకి బదిలీపై వెళ్లిన ముత్యం రాజేందర్ బుధవారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్ చేతుల మీదుగా బెస్ట్ సిటిజన్ సర్వీస్ అవార్డు అందుకున్నా రు. చిల్పూరు పీఎస్‌లో జూలై, ఆగస్టు నెలల్లో విధులు నిర్వహించిన సమయాన పౌరులకు అందించిన సేవలతో పాటు విధినిర్వహణలో చూపించిన ప్రతిభను గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు.

క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

వరంగల్: రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభి వృద్ధిశాఖ, స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణను యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్ పూర్‌లోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్, సర్వీస్, కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ మెకానిజం, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దాజీ, క్విల్ట్ బ్యాగ్స్ మేకింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో ఉచిత హాస్టల్, భోజన వసతితోపాటు ఉద్యోగం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల గ్రామీణ/పట్టణ ప్రాంత అభ్యర్థులు ఈనెల 30వ తేదీ ఉదయం 10గంటలకు స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థకు హాజరు కావాలని తెలిపారు. వివరాల కోసం 91339 08000, 91339 08111, 91339 08222, 99484 66111 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

స్వరం పడి యువకుడి మృతి

ఖిలా వరంగల్ : ఇంట్లో చాయ్ తాగుతున్న ఓ యువకుడు ఒక్కసారిగా స్వరం పడి.. దగ్గుతూ కుప్ప కూలిపోయాడు. హుటాహుటిన ఎంజీఎంకు తరలించగా మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. దీంతో కళ్ల ముందే చేతికి అందొచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషాదకర ఘటన ఫోర్ట్‌రోడ్డు విద్యానగర్ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన శీలం బాబురావు చిన్న కుమారుడు రాహుల్ (27) బుధవారం ఉదయం ఇంట్లో టీ తాగుతున్నాడు. ఈక్రమంలో స్వరం పడి దగ్గుతూ కుప్ప కూలిపోయాడు. హుటాహుటిన ఎంజీఎం తరలించారు. వైద్య పరీక్షలు చేయగా అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై బాబురావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



తస్మాత్ జాగ్రత్త..

కనిపించని కన్ను చూస్తోంది..

స్పై కెమెరాలతో అప్రమత్తంగా ఉండాలి

- ఇష్టానుసారంగా వినియోగిస్తున్న ఆకతాయిలు
- అనుమానం వస్తే నిశితంగా పరిశీలించాలి
- ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేయాలి
- టెక్నాలజీని మంచికి ఉపయోగిస్తేనే ఫలితం


స్పైకెమెరాల ఏర్పాటుకు అవకాశం ఉండే ప్రాంతాలు

కాజీపేట: టెక్నాలజీ.. మానవాళికి ఎంత మంచి చేస్తోందో.. ఆకతాయిలు, సంఘ విద్రోహుల చేతిలో పడి అంతే చెడు చేస్తోంది. ఫేస్‌బుక్, వాట్సాప్, యూ ట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలను అనుసరించి వ్యాపార అభివృద్ధి, స్నేహం, నాలెడ్జి పెంచుకుంటున్న వారు కొందరైతే.. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల సరఫరా, ఉద్యోగాల పేరుతో మోసానికి పాల్పడుతున్న వారు మరికొందరు. కాగా, ఇటీవల ట్రయల్ రూమ్, హాస్టల్ గదుల్లో స్పై కెమెరాలు (సీక్రెట్ కెమెరా) అమర్చిన ఘటనలు వింటున్నాం. విస్తరిస్తున్న టెక్నాలజీని ఇలా అడ్డదిడ్డంగా వినియోగిస్తే తర్వాత జైలుకెళ్లడం ఖాయం. స్వల్ప పరిమాణంలో ఉండే ఈ స్పై కెమెరాలతో ఆకృత్యాలకు ఒడిగడుతున్న వారు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. షాపింగ్ మాళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జిలు..ఇలా పబ్లిక్ ప్రదేశాల్లో ఎక్కడ ఏ కెమెరా కన్ను మనపై ఉందో తెలియని పరిస్థితి ఎదురవుతోంది. ముఖ్యంగా మహిళలు ఇలాంటి కెమెరాలకు బలవుతున్న ఘటనలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయి. అయితే కాస్త అప్రమత్తంగా ఉండి టెక్నాలజీని ఎలా వినియోగించాలో తెలిస్తే స్పై కెమెరాలను ఇట్టే గుర్తించే వీలుంది. అలా గుర్తించి పోలీసుల దృష్టికి తీసుకెళ్తే ఆకతాయిల పని పట్టేందుకూ అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో స్పై కెమెరా పని విధానం, ఆ కెమెరాను గుర్తించే వివిధ మార్గాల గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం..

గుర్తించడం ఎలా?

స్మార్ట్‌ఫోన్లు వాడేవారికి గూగుల్ ప్లే స్టోర్‌లో హిడెన్ కెమెరా డిటెక్టర్ అనే యాప్ చాలా సందర్భాల్లో పనిచేస్తుంది. ఐ ఫోన్లు వినియోగించే వారికి స్పై హిడెన్ కెమెరా డిటెక్టర్ యాప్ ఉపయోగపడుతుంది. స్పై కెమెరాలు వెలువరించే ఇన్‌ఫ్రారెడ్ కిరణాలను గుర్తించడం ద్వారా గదిని పూర్తిగా డార్క్ చేసినప్పుడు నిర్దిష్ట స్థలంలో కెమెరా ఉందా లేదా అనే విషయం గమనించి మొబైల్ అప్లికేషన్‌లో వాటిని చూపిస్తాయి. స్పై కెమెరాలను గుర్తించడానికి బగ్ డిటెక్టర్ అనే ప్రత్యేక పరికరాలుంటాయి.

మోషన్ డిటెక్షన్, సౌండ్ టెక్నాలజీ..

కొన్ని శక్తివంతమైన స్పై కెమెరాల్లో బ్యాటరీని ఆదా చేయడం కోసం సౌండ్, మోషన్ డిటెక్షన్ టెక్నాలజీ పొందుపరుస్తారు. గతంలో హాస్టళ్లలో జరిగిన ఘటనలు పరిశీలిస్తే ఒక్కొక్కటి సుమారు రూ.3వేల లోపు విలువైన స్పై కెమెరా సౌండ్ యాక్టివేటెడ్ ఫీచర్స్ కలిగి ఉన్నాయి. మహిళలు బాత్‌రూం రావడానికి ముందు డోర్ తీయగానే ఆ శబ్దానికి ఆటోమేటిక్‌గా కెమెరా యాక్టివేట్ అయి వీడియో రికార్డ్ చేస్తుంది. వ్యక్తుల కదలికలను బట్టి దానంతట అదే రికార్డింగ్ అవుతుంది. ఒకసారి చార్జ్‌చేస్తే రెజల్యూషన్ బట్టి నాలుగైదు గంటల పాటు నిరంతరాయంగా ఈ కెమెరాలు వీడియో రికార్డ్ చేస్తాయి.

ఎన్నో రకాలు..

చాలా మంది అనుకుంటున్నట్లు చూడటానికి కెమెరా మాదిరి ఉండదు. మనకు ఏ మాత్రం అనుమానం రాకుండా రకరకాల వస్తువుల రూపంలో రూపొందిస్తారు. అనేక స్పై కెమెరాలను గమనిస్తే జేబులో పెన్, షర్టు బటన్స్, టేబుల్ మీద పెట్టే చిన్న క్లాక్‌లు, రిస్ట్ వాచీలు, ఫ్లవర్ వాజ్‌లు, కీచైన్లు, హ్యాంగర్స్, ఇంట్లో ఉండే ఫొటో ఫ్రేమ్‌లు, మొక్కలు, స్విచ్‌బోర్డులు, బల్బులు ఇలా అనేక విధాలా స్పై కెమెరాలు దొరుకుతున్నాయి.

అనేక రకాల పరీక్షలు..

స్పై కెమెరాలను గుర్తించేందుకు టెక్నిక్స్ ఉన్నాయి. కొన్ని రకాల కెమెరాలున్న ప్రదేశాల్లో ఫోన్ కాల్ చేసేందుకు ప్రయత్నిస్తే ఆది కాల్ డ్రాప్ అవుతుంది. ఆయా కెమెరాల్లో ఉండే మ్యాగ్నటిక్ తరంగాల వల్ల ఇలా జరుగుతుంది. ఇటీవల కాల్ డ్రాప్ అనేది తరచూ ఎదుర్కొనే సమస్య కావడంతో స్పై కెమెరా ఉందని అనుమానించలేని పరిస్థితి. ఇక ట్రయల్ రూమ్స్‌లో అమర్చే అద్దాలు రెండు రకాలుంటాయి. సహజంగా అద్దం ఒకవైపు మన రూపాన్ని చూపిస్తూ, దాని వెనుక భాగంలో వేరే రంగుతో కోటింగ్ చేయబడి ఉంటుంది. కానీ కొన్ని అద్దాలు పారదర్శకంగా ఉండి, ఇవతలి దృశ్యాలను అవతలికి చూపిస్తుంటాయి. మీకు అలాంటి అనుమానం వస్తే అద్దంలో కొద్దిగా ఖాళీ స్థలం ఉండాలి. అలా కాకుండా రెండు టచ్ అయినట్లు ఉంటే ఆ అద్దం అవతలి వైపు మీ దృశ్యాలను చూపిస్తుందని గ్రహించాలి. లైట్లన్నీ ఆఫ్ చేసి, ఫ్లాష్ లైట్‌ని అద్దం మీద వేసినప్పుడు అవతలి వైపు ఏదైనా ఉందేమో తెలుస్తుంది.

స్పై కెమెరాలతో ప్రమాదాలు

స్పై కెమెరాల ద్వారా మహిళల నగ్న దృశ్యాలను రికార్డ్ చేసి వాటిని పోర్న్ సైట్లలో అప్‌లోడ్ చేస్తున్న వారు ఇటీవల అధికమవుతున్నారు. మరికొంత మంది ఆ వీడియోలను సంబంధిత మహిళలకు పంపించి బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. ఎక్కడైనా ఇలా అనుమానాస్పదంగా ఉన్న స్పై కెమెరాలను గుర్తిస్తే వాటికి సంబంధించిన ఆధారాలను స్మార్ట్ ఫోన్లో వీడియో, ఫొటోల రూపంలో రికార్డు చేయాలి. సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. షాపింగ్ మాల్స్ వంటి వాటిలో ఫ్లోర్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లాలి. వీడియో పుటేజీ రికార్డ్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తుంటే, వెంటనే కుటుంబ సభ్యులతో చర్చించి పోలీసుల దృష్టికి తీసుకెళ్లడం మంచిది. వృత్తి, ఉద్యోగాల్లో భాగంగా చాలా మంది మహిళలు నగరాల్లో హాస్టల్స్‌లో ఉంటున్నారు. వారు ఉండే గదులు, బాత్‌రూమ్‌లను నిశితంగా పరిశీలించాలి. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ స్పై కెమెరాలకు చెక్ పెట్టాలి.

మొబైల్స్‌తోనూ..

స్పై కెమెరాలు మాత్రమే కాదు, నిరంతరం మొబైల్ ద్వారా కూడా పబ్లిక్ ప్లేస్‌ల్లో మహిళల కదలికలు రికార్డు చేస్తున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్లలో ఎవరికీ అనుమానం రాకుండా ప్రివ్యూ కూడా కనిపించకుండా బ్యాక్ గ్రౌండ్‌లో వీడియోని రికార్డ్ చేసే యాప్స్‌ని వాడుతున్నారు.

భద్రు నాయక్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- మాజీ ఎంపీ సీతారాంనాయక్, కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి


మాట్లాడుతున్న మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్, పక్కన రిజిస్ట్రార్ మల్లారెడ్డి, తదితరులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో చిరు ఉద్యోగిగా చేరి ప్రొఫెసర్ స్థాయికి ఎదిగి వివిధ పాలన పదవులను నిజాయితీగా నిర్వర్తించిన హిస్టరీ విభాగం దివంగత ప్రొఫెసర్ భద్రునాయక్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు కోరారు. ఇటీవల మృతి చెందిన కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ భద్రునాయక్ సంస్మరణ సభను బుధవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో నిర్వహించారు. ఈ సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ నిరుపేద గిరిజన కుటుంబం నుంచి వచ్చిన భద్రునాయక్ కేయూలో విద్యార్థులను తీర్చిదిద్దటంతోపాటు అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా అంబేడ్కర్, మహాత్మాజ్యోతిరావుపూలే ఆలోచనలను చైతన్యం చేసేందుకు వివిధ సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించారన్నారు. భద్రునాయక్ మృతి అట్టడుగు, బడుగు, బలహీనవర్గాలకు తీరని లోటని అభిప్రాయపడ్డారు. నిబద్ధతతో సమాజం కోసం పనిచేసిన ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని, అప్పుడే భద్రునాయక్‌కు నిజమైన నివాళి అన్నారు. పీఠం డీన్ భుక్యాబాబురావు నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్, కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ కె. వెంకటనారాయణ, టీపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాదేవి, అంబేడ్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు సుదర్శన్, గిరిజన సామాజిక వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్, కుర్రా జనరల్ సెక్రటరీ వడ్డె రవీందర్,రిటైర్డ్ ఆచార్యులు విజయబాబు,ఎం. సారంగపాణి, ఎం. ఎర్రగట్టుస్వామి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేశ్ లాల్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మిద్దే ఎల్లయ్య, మానవహక్కుల వేదిక బాధ్యుడు బాదావత్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్లి శవమై తేలి..

- అశ్వరావుపల్లి రిజర్వాయర్‌లో మహిళ ఆత్మహత్య


సుక్కమ్మ మృతదేహం

రఘునాథపల్లి: అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళ అశ్వరావుపల్లి రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని యాపలగడ్డతండా శివారు చర్లతండాకు చెందిన గుగులోత్ సుక్కమ్మ (46) కొంతకాలంగా మానసిక స్థితి సరిగా ఉండడం లేదు. అలాగే, అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన సుక్కమ్మ.. మంగళవారం ఇంటి నుంచి వెళ్లి సమీపంలోని అశ్వరావుపల్లి రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా జాడలేదు. బుధవారం ఉదయం తండాకు చెందిన గుగులోత్ భద్రు పొలం వద్దకు వెళ్తుండగా రిజర్వాయర్‌లో సుక్కమ్మ శవం తేలియాడుతూ కనిపించింది. స్థానికులు, పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి కుమారుడు గుగులోత్ పరమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

కుటుంబ కలహాలతో కిష్టగూడెంలో వ్యక్తి..


మల్లేశం (ఫైల్)

లింగాలఘణపురం: మండలంలోని కిష్టగూడెం గ్రామానికి చెందిన మేకల మల్లేశం (48) కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మల్లేశం మద్యానికి బానిసై రోజు తాగడం, అనారోగ్యానికి గురవుతుండగా భార్య రేణుక వద్దని చెప్పడంతో ఇరువురి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి మల్లేశం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడికి కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

రైల్వే నో పార్కింగ్ జోన్‌లో పార్క్ చేయొద్దు

- కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ పరిధిలో ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేలా నిషేధిత రైల్వే ప్రాంతంలో రైల్వే ఉద్యోగులైనా, ప్రైవేట్ వ్యక్తులైనా పార్క్‌చేస్తే వారి వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ అవసరాల కోసం కాజీపేట జంక్షన్‌కు వచ్చిన వారు తమ వాహనాలు, కార్లను రైల్వే సర్క్యులేటింగ్ ఏరియాలోని నో పార్కింగ్ జోన్‌లో పార్క్ చేస్తున్నారన్నారు. ఈ దృశ్యాన్ని ఇటీవల తనిఖీల నిమిత్తం కాజీపేట జంక్షన్‌కు విచ్చేసిన రైల్వే సీనియర్ డీసీఎం చూసి సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్సీ ఆదేశాలనుసారం రైల్వే నో పార్కింగ్ జోన్‌లో ఇక మీదట ఎవరూ పార్క్ చేయొద్దన్నారు. ఒకవేళా పార్క్ చేస్తే రైల్వే యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. కొందరి రైల్వే అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు తెలిపారు.

మాజీ సర్పంచ్ నరేశ్ అరెస్ట్

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలం ఇస్లావత్ తండా గ్రామ మాజీ సర్పంచ్ ఇస్లావత్ నరేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని కురవి ఎస్సై గంద్రాతి సతీశ్ బుధవారం తెలిపారు. నరేశ్ సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఉప సర్పంచ్ ఇస్లావత్ రంగమ్మ సంతకం ఫోర్జరీ చేసి రూ.49 వేలు బ్యాంకు నుంచి డ్రా చేసిన విషయంలో అప్పటి ఎంపీఓ హరిప్రసాద్ విచారణ చేపట్టి కురవి పీఎస్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఉప సర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసింది వాస్తవమే అని ల్యాబ్ రిపోర్టురాగా ఆ కేసు విషయంలో నరేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- మినీ జాతర పనులు మహాజాతరకు పనికొచ్చేలా ఉండాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క


మాట్లాడుతున్న మంత్రి ధనసరి సీతక్క

ములుగు: మేడారం మినీజాతర–2025 విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో మినీజాతర నిర్వహణపై కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీశ్, డీఎఫ్ఓ రాహుల్‌కిషన్ జాదవ్‌తో కలిసి ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మినీ జాతర పనులు వచ్చే 2026 మేడారం మహాజాతరకు పనికొచ్చేలా ఉండాలన్నారు. మహా జాతర సమయంలో వందల కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నా శాశ్వతంగా ఉండకపోవడంతో వచ్చే జాతరకు మళ్లీ అవే పనులు చేపట్టాల్సి వస్తోందన్నారు. ఇప్పటి నుంచి చేసే ప్రతి పని దీర్ఘకాలికంగా ఉండేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పర్శ్ పథకాన్ని ప్రవేశపెట్టిన దృష్ట్యా జాతర పనులకు నిధులు వచ్చే అవకాశం ఉందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆ నిధులతో అమ్మవారి గద్దెల చుట్టూ ఫ్లోరింగ్ చేయడంతోపాటు నిత్యం మంచినీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా వసతులు కల్పించే బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. 2022 మహాజాతరలో చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్‌జీ, సంపత్‌రావు, మేడారం ఆలయ ఈఓ రాజేంద్రం, డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కేన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధనలు అవసరం

- యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ గీత వేముగంటి


ప్రొసీడింగ్స్‌ను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ గీత వేముగంటి, ఇతర ఆచార్యులు

కేయూ క్యాంపస్: కేన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ గీత వేముగంటి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ అనిమల్ సైన్సెస్' అనే అంశంపై రెండు రోజులు నిర్వహించనున్న జాతీయ సదస్సును రిజిస్ట్రార్ మల్లారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గీత వేముగంటి కేన్సర్ స్టెమ్ సెల్స్‌పై కీలకోపన్యాసం చేశారు. సాధారణ కణాలు ఉత్పరివర్తనం చెందడం వల్ల అవి కేన్సర్ కణాలుగా మారుతాయని, ఇలాంటి కణాలు శరీరంలోని ఇతర భాగాలకు కూడా వ్యాప్తి చెంది చివరికి కేన్సర్ చివరి దశలో ప్రాణాపాయ స్థితిలోకి సంభవిస్తుందన్నారు. అందుకే కేన్సర్‌కు సంబంధించిన మూల కణాలపై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి పరిశోధనల ఫలితాలే అనేక రకాల వ్యాధులకు ఔషధాలను సమకూర్చే వీలుంటుందన్నారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి. మల్లారెడ్డి మాట్లాడుతూ బయోటెక్నాలజీ రంగంలో దేశం ముందుకెళ్తోందని, విద్యార్థులు, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలపై దృష్టిసారించాలన్నా రు. ఈ సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య జి. షమిత, ఆ విభాగం ఆచార్యులు వై. వెంకయ్య, ఈసం నారాయణ, మామిడాల ఇస్తారి మాట్లాడారు. ఈసెమినార్‌లో ప్రొసీడింగ్స్‌ను విడుదల చేశారు. కాగా, రెండురోజులపాటు వివిధ చోట్ల నుంచి వచ్చిన వారు పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు. ఈనెల26న సాయంత్రం ముగియనున్నది.

చిరుత పులి చర్మం స్వాధీనం

- పోలీసుల అదుపులో ఛత్తీస్‌గఢ్ వాసి


చిరుత పులి చర్మాన్ని చూపిస్తున్న పోలీసులు

వాజేడు: ఛత్తీస్‌గఢ్ నుంచి అక్రమంగా చిరుతపులి చర్మాన్ని తీసుకువస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ములుగు ఓఎస్డీ, ఏటూరునాగారం ఇన్‌చార్జ్ ఏఎస్పీ మహేష్ గీతె బాబా సాహెబ్ బుధవారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ నుంచి చిరుతపులి చర్మాన్ని తెలంగాణకు తీసుకువస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చంద్రుపట్ల క్రాస్ వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్, వాజేడు రేంజర్ చంద్రమౌళి, అటవీశాఖ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో నంబర్ లేని ద్విచక్రవాహనంపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వైపు నుంచి వస్తున్న జాడి మహేందర్ అనే వ్యక్తిని ఆపి తనిఖీ చేశారు. అతని వద్ద ఉన్న బ్రౌన్ కలర్ సంచిలో చిరుత పులి చర్మం లభించింది. రేంజర్ పరిశీలించి నిజమైన చిరుత పులి చర్మంగా నిర్ధారించారు. మహేందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తనది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా, భూపాలపట్నం తహసీల్ పరిధిలోని ఊళ్లూరుగా వెల్లడించాడు. అతడినుంచి మొబైల్, ద్విచక్రవాహనం, చిరుత పులి చర్మాన్ని స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ కోసం రేంజర్‌కు అప్పగించినట్లు ఏఎస్పీ తెలిపారు.

ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తే కేసులు

- సివిల్ సప్లై స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్


మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మహబూబాబాద్: ధాన్యాన్ని దుర్వినియోగం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ ఎం. ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం మానుకోట మున్సిపాలిటీ పరిధి అనంతారం శివారులోని సాయి శ్రీనివాస రైలుమిల్లుపై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన మరిపెడ మండలం ఎల్లంపేటలోని ఓ రైలు మిల్లులో, 21న కురవి మండలం మొగిలిచర్లలోని నవ్య ఇండస్ట్రీస్‌పై, ఈనెల 24వ తేదీన పెద్దగూడూరు మండలం అప్పరాజుపల్లిలోని రాజరాజేశ్వర రైలు మిల్లులో తనిఖీలు చేశామన్నారు. ఈ మిల్లుల్లో ధాన్యం లేకపోవడంతో క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ నెల 25వ తేదీన సాయి శ్రీనివాస ఇండస్ట్రీస్‌లో తనిఖీ చేయగా మిల్లుతో పాటు మరో రెండు గోదాంల్లో ధాన్యం నిల్వ చేశారన్నారు. 88 వేల, 96 క్వింటాళ్ల ధాన్యం కేటాయించగా కొంత కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇచ్చారన్నారు. ఇందులో 82వేల క్వింటాళ్ల ధాన్యం ఉండాల్సి ఉండగా సుమారు 54వేలు మాత్రమే ఉందని, సుమారు 20 వేల క్వింటాళ్ల ధాన్యం తక్కువ ఉందన్నారు. కాగా, ఇప్పటి వరకు ఈ మిల్లు యాజమాన్యం రూ. 2 కోట్ల 58 లక్షలు చెల్లించారని, మిగతా డబ్బులు చెల్లించేందుకు మూడు రోజుల సమయం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో డీసీఎస్ఓ ప్రేమ్‌కుమార్, మేనేజర్ కృష్ణవేణి, ఏఎస్ఓ రమేశ్, టాస్క్‌ఫోర్స్ ఎస్సై కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లను ఖాళీ చేయించిన అధికారులు


శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న మహిళ


ఆరుబయట ఉన్న బాధితుల సామగ్రి

- ఆత్మహత్యాయత్నం చేసిన మహిళలు
- సామగ్రితో ఆరుబయటే ఉన్న బాధితులు

పాలకుర్తి టౌన్: మండలంలోని తొర్రూరు(జె)లో గత ప్రభుత్వం నిర్మించిన 20 డబుల్ బెడ్ రూం ఇళ్లను ఆక్రమించుకోవడంతో బుధవారం రెవెన్యూ, పోలీసు, జీపీ సిబ్బంది ఖాళీ చేయించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసం ఉంటున్న పసులాది అంజమ్మ, పద్మ, గడ్డం భూలక్ష్మి, జోడు ఇందిర, గడ్డం ప్రజాపతి శరీరంపై పెట్రోల్ పోసుకుని నిరసన తెలుపుతూ ఆత్మహత్యకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఇళ్లను ఖాళీ చేయబోమని పట్టుబట్టడంతో ఉద్రిక్తత వాతావరణంలో అధికారులు ఖాళీ చేయించి తాళాలు వేసి సీల్ వేశారు. దీంతో బాధితులు సామగ్రితో ఆరుబయటే ఉన్నారు. కార్యక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి, పాలకుర్తి, దేవరుప్పుల ఎస్సైలు యాకూబ్ హుస్సేన్, సృజన్, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ఐ రాకేశ్, పంచాయతీ కార్యదర్శి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలి..

ఎనిమిది నెలల నుంచి డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివాసం ఉంటున్న అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఆ ఇళ్లు కేటాయించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి డిమాండ్ చేశారు. తొర్రూరు గ్రామ డబుల్ బెడ్ రూం ఇళ్ల బాధితులతో కలిసి బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు మాచర్ల ఎల్లయ్య, నాయిని మల్లారెడ్డి, పాము శ్రీను, పసులాది శంకర్ పాల్గొన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

- రెగ్యులర్&డిస్టెన్స్‌అడ్మిషన్స్:డిగ్రీ,PG, B.Tech., Diploma, D&B- ఫార్మసీ, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. 4 నెలల్లో పరీక్షలు. ఫోన్ : 8866977112, 339 [HA-16400]

REAL ESTATE

FARM LAND FOR SALE

- Farm Land for Marketing @ JP, Dargah. Total 6 Acre. Per Sq.Yd 6,500/-. Interested Companies Please Cont: +91 9646809999. [WA-7541]

PLOT FOR SALE

- ఒగ్లాపూర్ పవర్‌గ్రిడ్‌కు ఎదురుగా 200 ఫీట్ రోడ్‌కి ఆనుకొని కాంపౌండ్ కట్టి ఉన్న ప్లాటు (వెడల్పు 30 పొడవు 120) 400 చ॥గ॥ ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9701218888. [W-1237301]

SERVICES

FINANCE

- హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1239971]

WANTED

- వరంగల్, పరకాల, కాటారం, ఏటూర్‌నాగారం, నర్సంపేట, తొర్రూర్, MHBD, జనగాం, ఏరియాలో ఆఫీస్‌లో IC, ASM, ESM, BDM పోస్టులకై 10th, డిగ్రీ, చదివిన స్త్రీ/పు॥లు కావలెను. ఇంటర్వ్యూ. HNK. 9492505566. [W-1237302]
- మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/-. ఫోన్ : 70756 56208 [V-6560]
- షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, కాంపౌండర్స్, వార్డ్ బాయ్స్, ఆయాలు, లేడి సూపర్‌వైజర్స్ భార్యభర్తలు కావలెను.Ph: 9391036931, 9246585901 [HA-14711]
- త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీ వసతి + భోజనం. జీతం: 17K. ఫోన్: 8520874499, 8520980099 [H-796282]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.